www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 20 ఆగస్టు 2025
5
చిత్తూరు

కోతల భరోసా!

అనర్హత పేరుతో భారీ సంఖ్యలో తగ్గించిన పింఛన్లు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: వివిధ రకాల వికలాంగులకు అందించే పింఛను దారులపై అనర్హత పేరుతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం భారీ సంఖ్యలో కోత విధించింది. దీంతో వికలాంగుల్లో ఆందోళన నెలకొంది.

దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాల్లోని అర్హులకు వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లుగీత, ఒంటరి మహిళలు, మత్స్యకారులు, హెచ్ఐవి వ్యాధిగ్రస్తులు, డప్పు కళాకారులు, చర్మకారులు, వృద్ధకళాకారులు, హిజ్రాలకు నెలకు రూ. 4 వేల రూపాయలు ఎన్‌టిఆర్ భరోసా పేరిట ప్రభుత్వం అందిస్తోంది. దివ్యాంగులకు నెలకు రూ. 6 వేలు, మంచానికే పరిమితమైన పక్షవాత వ్యాధిగ్రస్తులు, తీవ్రమైన కండరాల బలహీనత, ప్రమాద బాధితులకు రూ. 15వేలు , సైనిక వెల్ఫేర్ పింఛన్ రూ. 5వేలు దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధిగ్రస్తులకు రూ. 10వేలు, అభయ హస్తం పింఛన్‌దార్లకు రూ. 5వేలు అందిస్తోంది.

గత ప్రభుత్వం భారీగా అనర్హులను అర్హులుగా గుర్తించి పింఛన్లు మంజూరు చేసిందంటూ కూటమి ప్రభుత్వం రీవెరిఫికేషన్ చేపట్టింది. రీ వెరిఫికేషన్ పేరుతో అర్హులను అనర్హులుగా తేల్చి భారీ సంఖ్యలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లలు తొలగించడంతో జిల్లా వ్యాప్తంగా సామాజిక పింఛన్లు పొందుతున్న వారి నుండి నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. కలెక్టరేట్ సాక్షిగా అన్ని రకాలుగా అర్హులైన తమ పింఛన్లు తొలగించాంటూ దివ్యాంగుల సంఘం నేతృత్వంలో పెద్ద సంఖ్యలో వచ్చిన దివ్యాంగులు ఆందోళన చేపట్టారు. స్వయంగా కలెక్టర్ వచ్చి అర్హుల పింఛన్లు తొలగించేది లేదని భరోసా ఇచ్చారు. విల్‌చైర్‌కు పరిమితమైనవారు, పూర్తి వికలత్వం ఉన్న వారికి సైతం 40 శాతం వికలత్వం ఉన్నట్లు రీవెరిఫికేషన్‌లో సదరం సర్టిఫికెట్లు మంజురు చేయడం, పింఛన్ కోల్పోయామని బాధితులు వాపోయారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలో వివిధ రకాల పింఛన్లు 5,54,579 వున్నాయి. ఆగస్టు నెలలో రూ. 1149.07 కోట్లు రూపాయలు పంపిణీ చేశారు. గత ఏడాది అగస్టు నెలలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 5,67,942 మంది వివిధ రకాల సామాజిక పింఛను దారులు వుండగా ఏడాది కాలంలో వేల వేలకు పైగా పింఛన్ లబ్ధిదారులను వివిధ కారణాలతో తొలగించారు. కూటమి ప్రభుత్వం

నిర్వహిస్తున్న సదరం క్యాంపుల్లో దివ్యాంగుల వికలత్వం తగ్గించి సర్టిఫికెట్లు జారీ చేస్తుండటంతో పెద్ద సంఖ్యలో వికలాంగులు పింఛన్లు కొల్పోయారు. ఈ మేరకు ఒక్క చిత్తూరు జిల్లాలో నెలకు రూ. 15వేల పింఛన్ తీసుకొనేవారు 2,500 మంది ఉంటే 700 మందిని మాత్రమే అర్హులుగా తేచ్చారు. మిగిన వారంత ఆగస్టు నెలలో అనర్హులుగా తేల్చడంతో పింఛన్ కొల్పాయారు. రూ.6వేల పింఛన్ పొందే పింఛను దారులను కూడా భారీ సంఖ్యలో అనర్హత పేరిట తొగించారు. ఈ మేరకు వికలత్వం తక్కువ శాతం వుందని వచ్చే నెల నుండీ పింఛన్ కోల్పోతారు..' అంటూ సచివాలయ సిబ్బంది ద్వారా నోటీసులు అందిస్తున్నారు. ఇలా నోటీసులు అందుకున్నవారు తాము అర్హులమంటూ తిరిగి సదరం క్యాంపులో వైద్య పరీక్షలు చేయించుకొని అర్హత ఉన్నట్లు సరిఫికెట్ పొందాల్సి ఉంటుంది. అలా ఇవ్వకుంటే పింఛను కోల్పోవాల్సిందే..పింఛన్‌కు 30 రోజులు సమయం ఇస్తూ ఈనెల 21 వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు.

ఇదీ లెక్క..

పింఛన్ల వడపోతకు పూనుకున్న కూటమి ప్రభుత్వం 11,446 మంది అర్హత లేనట్లుగా గుర్తించి రద్దు చేసింది. మంచానికే పరిమితమై రూ. 15 వేలు పొందుతున్న వారిని రూ. 6వేలకే పరిమితం చేస్తూ 824 పింఛన్లు తగ్గించారు. దివ్యాంగ పింఛన్లు 35, 277 ఉంటే ఇందులో 22,334 పింఛన్లు రీ వెరిఫికేషన్ చేసి 4,732 పింఛన్లు రద్దు చేశారు. ఇలా వడపోతలతో 17,606 దివ్యాంగులను మాత్రమే ఆగస్టు నెలలో అర్హులుగా తేల్చి పింఛన్ ఇచ్చారు. ఇలా చిత్తూరు, తిరుపతి జిల్లాలో రూ.15 వేలు పింఛన్ పొందుతున్న వారిలో 317 మంది పింఛన్లు రద్దు చేశారు. 1,260 మంది దివ్యాంగులను రూ.6వేలకు పరిమితం చేశారు. మరో 98 మందిని వృద్ధాప్య పింఛన్‌లకు పరిమితం చేశారు. నెలకు రూ. 6 వేలు పొందే దివ్యాంగ పింఛన్లు 11,129 మందికి రద్దు చేశారు. 2,250 మంది దివ్యాంగులను నెలకు వృద్ధాప్య పింఛన్ మార్పు చేసి నెలకు రూ. 4వేలకు పరిమితం చేశారు. ఈ లెక్కన రెండు జిల్లాలో నెలకు రూ. 8,82,51,000 పింఛన్ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు పింఛన్ పొందుతున్న వారి పొట్టగొట్టి మిగిల్చుకోనుంది.

అత్యంత దారుణం

గత ప్రభుత్వం అర్హులుగా గుర్తించి సదరం సర్టిఫికెట్లు పొందిన దివ్యాంగులకు పింఛన్లు మంజురు చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరుతో భారీగా దివ్యాంగులను అనర్హులంటూ తొలగించడం అత్యంత దారుణం. వికలత్వం ఉన్నా సదరం వైద్యులు లేనట్లుగా 40 శాతం మాత్రమే ఉన్నట్లు సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. రెండు కాళ్లు, చేతులు లేని వారికి సైతం 40 శాతం లోపే ఇస్తున్నారు. ఫలితంగా అనేక మంది ఆగస్టు నెలలో పింఛన్ కోల్పోయారు. వికలాంగ జేఏసిగా అర్హులైన వారిని తొలగించడాన్ని తీవ్రంగా ఖడిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా ఆందోళ చేపడుతాం..

-మురళి, వికలాంగ జేఏసి రాష్ట్ర నాయకులు.

కుప్పంలో తల్లీబిడ్డ అదృశ్యం

ప్రజాశక్తి-కుప్పం:

కుప్పం మండలం జరుగు గ్రామానికి చెందిన చంద్రలేఖ (28) తన పది నెలల కొడుకుతో కలిసి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం చంద్రలేఖ అదృశ్యం కాగా కుటుంబ సభ్యులు వెతికిన ఫలితం లేకుండా పోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు. సమాచారం తెలిస్తే కుప్పం సిఐ 9440900733, ఎస్ఐ 900039059 నెంబర్‌కు తెలపాలని సూచించారు.

గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో...

వైసిపి ఇన్‌ఛార్జిగా హరికృష్ణ..?

'స్వామి'ని పక్కనపెట్టిన జగన్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రయత్నాలను ముమ్మరం చేశారు. నియోజకవర్గంలో ఇన్‌ఛార్జిగా కొనసాగుతూ, కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో లేని, ఆరోపణలు ఉన్న నాయకులను పక్కన పెట్టేందుకు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గంగాధర నెల్లూరు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు కంచుకోట. 35 ఏళ్లుగా అప్పట్లో కాంగ్రెస్, ఆ తరువాత వైసిపి అభ్యర్థులు ఎంఎల్ఎలుగా గెలుపొందుతూ వచ్చారు. అంతటి ఆదరణ ఉన్న ఆ నియోజకవర్గంలో మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి గత పదేళ్లుగా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. ఎంఎల్ఏగానూ గెలిచి డిప్యూటీ సిఎంగానూ పదేళ్ల కొనసాగారు. అయితే కార్యకర్తలకు, నాయకులకు న్యాయం చేయకపోగా వారి మధ్యలో గ్రూపులుగా విభజించి చిచ్చుపెట్టి వేడుక చూశారన్నది ఆ నియోజకవర్గంలో ద్వితీయశ్రేణి నాయకుల ఆరోపణ.

మాజీ ఎంపి జ్ఞానేంద్రరెడ్డి సైతం 2024 ఎన్నికల్లో నారాయణస్వామికే కాదు, ఆ కుటుంబంలో ఎవరికి సీటు ఇచ్చినా పార్టీ ఓటమి పాలవుతుందని జగన్మోహన్‌రెడ్డికి ముందస్తుగా చెప్పారు. అయినా జగన్మోహన్‌రెడ్డి నారాయణస్వామిపై ఉన్న నమ్మకంతో ఆ కుటుంబంలోనే సీటు ఇచ్చారు. కుమార్తె కళత్తూరు కృపాలక్ష్మి సీటు దక్కించుకుని పోటీ పడ్డారు. అయితే టిడిపి అభ్యర్థి థామస్ చేతిలో 28వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అప్పటినుంచి నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిగా ఆమె కొనసాగుతూ వచ్చారు. పార్టీ అధికారం కోల్పోవడంతో వృత్తిరీత్యా డాక్టర్‌గా ఉన్న ఆమె విజయవాడలో తిరిగి సెటిలయ్యారు. చుట్టంచూపుగా నియోజకవర్గానికి రావడం తప్ప, టిడిపి నుంచి కార్యకర్తలకు ఎదురయ్యే వివాదాలను, సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారు. దీంతో నాలుగేళ్లపాటు టిడిపిని ఎదుర్కోలేక ఏడాదిన్నర పాటు తటస్థంగానే నారాయణస్వామి కుటుంబం ఉంటూ వచ్చింది. వెదురుకుప్పం, పెనుమూరు, కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం మండలాలకు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఇక్కడ జరుగుతున్న విషయాలను స్థానికుడైన చిత్తూరు అసెంబ్లీకి పోటీచేసి ఓటమి పాలైన విజయనాందరెడ్డి జగన్‌కు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తూ వచ్చారు. దీంతో రాబోయే 'స్థానిక, పంచాయతీ' ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ కూటమిని ఎదుర్కోవాలంటే ఇన్‌ఛార్జిని మార్పు చేయక తప్పదని జగన్మోహన్‌రెడ్డి భావించినట్లు విశ్వసనీయ సమాచారం. నారాయణస్వామి కుటుంబాన్ని పక్కన పెట్టి, త్వరలోనే నియోజకవర్గంలో పట్టున్న మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ కుమారుడు హరికృష్ణకు పగ్గాలు ఇస్తారని చర్చ నడుస్తోంది.

రేపు గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ భూసేకరణపై గ్రామసభలు

ప్రజాశక్తి- రామకుప్పం:

రామకుప్పం మండల పరిధిలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి భూ సేకరణ నిమిత్తమై గురువారం రెవెన్యూ డివిజన్ అధికారి అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహశీల్దారు కౌలేష్ తెలిపారు. ఈనెల 21న గురువారం మనేంద్రం రెవెన్యూ, అంకిరెడ్డిలపల్లి రెవెన్యూ, కిలాకిపాడు రెవెన్యూ, కలిసిన కుప్పం రెవెన్యూ, బొందలకుంట రెవెన్యూ గ్రామాల ప్రజలతో సమన్వయమై గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధిత ఎయిర్ పోర్ట్ భూముల హక్కుదారులు, ప్రజలు తప్పనిసరిగా హాజరుకావాలని వారు పేర్కొన్నారు.

కాణిపాకం బ్రహ్మోత్సవాలకు రండి..

దేవాదాయ శాఖ మంత్రికి ఎమ్మెల్యే ఆహ్వానం

ప్రజాశక్తి-ఐరాల:

కాణిపాకం స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఆహ్వానించారు. మంగళవారం విజయవాడ ఏపీ సచివాలయంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కాణిపాకం బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందించారు. ఈ నెల 27 వ తేదీ నుండి సెప్టెంబర్ 16వ తేదీ వరకు నిర్వహించే వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరారు. అనంతరం మంత్రికి ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే మురళీమోహన్ అందించారు. ఆలయ వేద పండితులు వేద ఆశీర్వాదం అందించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఐరాల మండల అధ్యక్షుడు గంగారపు హరిబాబు నాయుడు, పూతలపట్టు నియోజకవర్గం పోల్ మేనేజ్‌మెంటు కో ఆర్డినేటర్ గిరిధర్ బాబు, కాణిపాకం దేవస్థానం మాజీ చైర్మన్ మణి నాయుడు, ఆలయ సిబ్బంది, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

మోడీ గద్దె దిగాలి: కాంగ్రెస్

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : దొంగ ఓట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మోడీ గద్దె దిగాలని, ఎన్నికల కమిషన్ బిజెపి చేతిలో కీలుబొమ్మగా మారి పోలింగ్ వ్యవస్థను తారుమారు చేసిందని గంగాధర నెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి రమేష్ అన్నారు. ఎస్ఆర్ పురంలోని పుల్లూరు క్రాస్ రోడ్ లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాధముని రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ గంగాధర నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేష్ బాబు, నాయకులు కార్యకర్తలతో కలిసి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ బీహార్‌లో లక్షల ఓట్లు దొంగ ఓట్లు సృష్టించే దొంగ చాటుగా ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వాన్ని 'మోడీగద్దె దిగాలి.., మోడీ డౌన్ డౌన్ ..'అంటూ నినాదాలు చేశారు. క్యాండిల్ ర్యాలీ, పుల్లూరు క్రాస్ నుంచి మండల కార్యాలయం వద్ద వరకు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌతమ్ రాజు, గోవర్ధన్, బండ్ల సుబ్బరాయలు, మోహన్, గోవిందరాజులు, యు ఎ పురం కుప్పయ్య, జయ చంద్ర , వెంకటేష్, యుగంధర్ నాయుడు, నరసింహారెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అయినవాళ్లకే త్వరగా పనులు!

- నిత్యం క్యూలైన్‌లో వివాదాలు
- నిబంధనలు పాటించని అధికారులు
- ఇదీ నగరి రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌లో పరిస్థితి

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్ రిజర్వేషన్ కౌంటర్‌లో పైరవీలు రాజ్యమేలుతోంది. అయిన వారికే రిజర్వేషన్ పనులు త్వరగా చేస్తున్నారు. వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు వేకువజామునే వచ్చి ఫామ్‌లు నింపి కౌంటర్‌లో ఉంచి గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడినా వారికి ఫలితం లేని పరిస్థితి నెలకుంటోంది. ఆలస్యంగా వచ్చినా అయినవాళ్లకే ఆధికారులు రిజర్వేషన్ చేసి పంపుతున్నారు. వారి ఫామ్‌లనే ముందు రిజర్వేషన్‌కు అనుమతిస్తున్నారు. ఒక ఫామ్‌కు ఒక వ్యక్తి ఉండాలని ఖచ్చితంగా ఆదేశాలు వున్నా ఈ అధికారులు అయిన వాళ్లకు మాత్రం ఒక వ్యక్తి వస్తే నాలుగైదు ఫామ్‌లను రిజర్వేషన్ చేసుకునేందుకు తీసుకుంటున్నారు. దీంతో క్యూలైన్‌లోని వారి ఫామ్ నింపేలోపు సీటు దక్కక వెయిటింగ్ లిస్టులోకి వచ్చేస్తోంది. ఈ కారణంగా నిత్యం రిజర్వేషన్ కౌంటర్ వద్ద క్యూలైన్‌లో నిలబడ్డ వారి మధ్య వాగ్వివాదాలు, గొడవలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు సక్రమంగా తమ విధులు నిర్వర్తించక పోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంటోందని, నగరిలో రిజర్వేషన్ కౌంటర్ ఉన్నా ప్రజలకు ప్రయోజనకరంగా లేకుండా పోతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే ఉన్నతాధికారులు సత్వర చర్యలు చేపట్టి ఈ సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌లో గంటల తరబడి నిరీక్షిస్తున్న ప్రయాణికులు

బ్యానర్, గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న వైద్య ఆరోగ్యశాఖాధికారులు

పరిశుభ్రత పాటించి దోమలు నివారిద్దాం..

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పరిశుభ్రత పాటించి దోమలు నివారిద్దామని జిల్లా ఇన్‌ఛార్జి వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ ప్రపంచ దోమల నివారణ దినోత్సవం బ్యానర్ , గోడ పత్రికలను వారు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్వో మాట్లాడుతూ దోమల నివారణకు ప్రజల భాగస్వామ్యంతో ముందస్తు జాగ్రత్తలు అత్యవసరమని, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తప్పక పాటిస్తే లార్వాల నాశనంతో, దోమల పెరుగుదలను నివారించవచ్చని తెలిపారు. తద్వారా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాధి ,ఫైలేరియా మనకు రాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పిహెచ్‌సి డాక్టర్లు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పెద్ద చెరువును పరిరక్షించాలి

- ఆక్రమణలు లేకుండా చూడాలి
- చెరువు కట్టను తవ్వేయడంపై అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరుకు తలమానికమైన పెద్ద చెరువును పరిరక్షించాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆక్రమణదారుల కోసం అధికారులు చెరువుకు గండి కొట్టి చెరువులోని నీటిని రైతుల పంట పొలాల్లోకి వదిలేశారని పత్రికలలో రావడంపై ఆయన ఘాటుగా స్పందించారు. దీంతో మున్సిపల్ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువుకు గండి కొట్టడానికి గల కారణాన్ని మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు ఆయకట్టు ప్రాంతంలోని పలువురి ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందులు ఉన్నట్లు ఫిర్యాదులు రావడంతో నీటిని మళ్లించినట్లు తెలిపారు. అయితే దీనిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నీటిని మళ్లించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నప్పటికీ కట్టను తవ్వేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పట్టణ ప్రజలకు, ఆయకట్టు రైతులకు ఇబ్బంది కలగకుండా వెంటనే కట్ట మరమ్మతు పనులు పునరుద్ధరించి సప్లై ఛానల్ ద్వారా నీటిని తరలించే చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అందుకోసం అవసరమైన నిధులను వెంటనే తెప్పించేందుకు కృషి చేస్తానని, ఇందుకు రెవెన్యూ అధికారుల సహకారంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇక చెరువు ఆక్రమణలకు గురి కాకుండా వెంటనే హద్దులను గుర్తించి పరిరక్షించాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దారు ఇన్బనాథన్, మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి, ఇరిగేషన్ డిఈ చొక్లా నాయక్, ఏఈ లక్ష్మీనారాయణలతో పాటు మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

కానరాని పారిశుధ్యం!

- అధికారుల నిర్లక్ష్యం
- వెంటాడుతున్న అనారోగ్య సమస్య

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని కంభంపల్లి పంచాయతీ పరిధిలోని దాసర్లపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో నెలకొన్న పారిశుధ్య సమస్యలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. డ్రైనేజీలు పొంగిపొర్లుతూ, మురికి నీరు రోడ్లపైకి చేరుకోవడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్య తీవ్రత

దాసర్లపల్లి ఎస్సీ కాలనీలో డ్రైనేజీ కాలువలు పూర్తి స్థాయిలో నిండిపోయి మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. అదే ప్రాంతంలో తాగునీరు బయటకు పొంగుతోంది..నిలిచిపోయిన నీటి కారణంగా దోమలు, పురుగులు విపరీతంగా పెరిగిపోయి ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

పట్టించుకోని అధికారులు

గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఈ సమస్య తీవ్రతను వివరించేందుకు ప్రయత్నించినా అందుబాటులో లేకపోవడంతో సమస్య మరింత పెరుగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

అధికారులు స్పందించాలి

అధికారులు వెంటనే స్పందించి దాసర్లపల్లి ఎస్‌సి కాలనీలోని డ్రైనేజీ కాలువలను పరిశీలించి, యుద్ధ ప్రాతిపదికన క్లీన్ చేయిం చాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా, కాలువ లను శుభ్రపరిచి కాలనీ వాసులు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరుతున్నారు. మురుగునీరు నిలిచిపోవడం వల్ల కలరా, డెంగీ వంటి నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై స్థానిక అధికారులు తక్షణమే స్పందించి, దాసర్లపల్లి ఎస్సీ కాలనీలో పారిశుధ్య పరిస్థితిని మెరుగుపరిచి, ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దాసర్లపల్లి ఎస్‌సి కాలనీలో లోపించిన పారిశుధ్యం

వాహనాలు వెళ్లేది ఎలా?

- గుంతలమయమైన రోడ్డు
- భయం గుప్పెట్లో వాహనచోదకులు
- స్పందించని అధికారులు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: ఆ రోడ్డుపైన వాహనదారులు వాహనాలు నడపాలంటే భయం గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. వాహనాలు నడిపేటప్పుడు ఎదురుగా వచ్చే గుంతలను తప్పించుకొని ప్రయాణం సాగించాలంటే ప్రమాదవశాత్తు రోడ్డు మీద పడితే తీవ్రమైన గాయాలతో ఆసుపత్రులలో చేరాల్సిందే అని వాహన చోదకులు చెబుతున్నారు.

వాహనాలు వెళ్లేది ఎలా?

గంగాధర నెల్లూరు నుంచి ముసలయ్య గారి పల్లి వరకు రోడ్డు కంకరతేలి అధ్వానంగా మారింది. ఈ రోడ్ మీదుగా గంగాధర నెల్లూరు, వేపంజేరి, బంగారెడ్డిపల్లి , చిన్న వేపంజేరి పంచాయ తీలకు చెందిన పలువురు వాహనదారులు వెళుతుంటారు. ఈ రోడ్డు బలిజ కండ్రిక, పాలసముద్రం మండలాలకు వెళ్లాలంటే ఈ దారిలో వెళ్లాల్సిందే.

గుంతలమయమైన రోడ్డు

ఈ రోడ్ ఎక్కువ భాగం కంకరరాళ్లు తేలి గుంతల మయమైంది. వర్షాలు పడితే ఈ వర్షపు నీరు గుంతల్లో చేరి రోడ్డు కూడా కనిపించని పరిస్థితి. ఈ రోడ్‌లో ఎప్పుడు ఎలా ఎక్కడ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

భయం గుప్పెట్లో వాహనచోదకులు

ఈ మార్గంలో నిత్యం రైతులు, వాహనాల దారులు, ప్రజలు, స్కూలు విద్యార్థులు అధిక సంఖ్యలో వెళుతుంటారు. సుమారు ఏడు కిలోమీటర్ల మేర వున్న ఈ రహదారి కంకర తేలి గుంతలయమై అధ్వానంగా మారింది. వాహన చోదకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వ అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బంగారెడ్డిపల్లి వద్ద కంకర తేలిన రోడ్డు

కట్టకిందపల్లి వద్ద కంకర్లు తేలిన రోడ్డు

పాఠశాలలో ఆధార్ క్యాంపు

ప్రజాశక్తి - విజయపురం (నగరి): విద్యార్థుల బయోమెట్రిక్ అప్డేట్ కోసం పాఠశాలల్లో ఆధార్ క్యాంప్‌లు ఏర్పాటు చేశామని ఎంఇఓ శ్రీదేవి తెలిపారు. మంగళవారం పీసీఎన్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంప్‌ను ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల వయస్సు ఉన్నవారు బయోమెట్రిక్స్ అప్డేట్ చేసుకోవాలన్నారు. ఈ నెల 23 వరకు తొలివిడత క్యాంప్‌లు, 28 నుంచి 30 వరకు రెండవ విడత క్యాంప్‌లు ఉంటాయని ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ రాజకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

గోకులం షెడ్లు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కుప్పం : గోకులం షెడ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మణి పేర్కొన్నారు. కుప్పం మండలం చెక్కు నత్తం హరిజనవాడలో రైతు నారాయణ పొలంలో నూతనంగా నిర్మించిన షెడ్ ప్రారంభానికి సంబంధించి మంగళవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని రైతులు సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి -బంగారుపాలెం: స్థానికులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. మండలంలోని రాగిమానిపెంట రోడ్డులోని ఇందిరమ్మ కాలనీ వద్ద స్థానికులు రహదారిలో ఏర్పడ్డ గుంతలను సొంత నిధులతో ఇసుక, సిమెంట్, ఇసుక కలిపి మంగళవారం గుంతలు పూడ్చారు. వారు చేపడుతున్న ఈ కార్యక్రమానికి పలువురు అభినందనలు తెలిపారు. ఏడు కిలోమీటర్లు వెళ్లే ఈ రహదారిలో గుంతలు అధికంగా ఉన్నాయని ఈ గుంతల వల్ల ప్రమాదాలు అధికమవుతున్నాయని సంబంధించిన రోడ్డు భవనాల శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో స్థానికులు స్పందించారు. గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టారు.

రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న స్థానికులు

సమాచార హక్కు చట్టంపై అవగాహన: కమిషనర్

ప్రజాశక్తి-కుప్పం: సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సచివాలయాల వారీగా 21 నుండి 23 వరకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కుప్పం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయ అడ్మిన్‌లకు మున్సిపల్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రజలు సమాచార హక్కు చట్టానికి సంబంధించి అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

ఓవర్ హెడ్ ట్యాంకుల క్లీనింగ్

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయితీలోని ఓవర్ హెడ్ ట్యాంకులను మంగళవారం బ్లీచింగ్‌తో పరిశుభ్రం చేయించారని పంచాయితీ కార్యదర్శి మేనక తెలిపారు. ఈ సందర్భంగా ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ప్రతి 15 రోజులకు ఒకసారి ట్యాంకులను శుభ్రం చేయడం జరుగుతుందని ట్యాంకుల చుట్టూ పిచ్చి మొక్కలు తొలగించామన్నారు. ఎక్కడైనా పైపులైను లీకేజీలు కారణంగా నీరు వృధాగా పోతుంటే వాటికి మరమ్మతులు చేయిస్తున్నామని తెలిపారు. ప్రజలు పంచాయతీ వారికి సహకరిస్తూ తాగునీరు వృధా చేయకుండా కుళాయిల వద్ద నీరు నిలవ ఉండకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్

ప్రజాశక్తి-ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 27 నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా కాణిపాకం ఆలయం వద్ద పోలీసు శాఖ, ఆరోగ్యశాఖ, ఫైర్ సిబ్బంది మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎస్వీ నంద, డీఎస్పీ సాయినాథ్, సీఐ, పిఎస్ఐ నరసింహరావు, ఇంజనీరింగ్ సిబ్బంది, కాణిపాకం ఎస్ఐ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

దారి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం అన్నెమ్మగారి పల్లి పంచాయతీ ముద్దుకాలువ నుండి తమ పొలాలకు అటవీ భూముల నుండి దారి విషయమై కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్ మధుసూదన్, అటవీశాఖ సిబ్బంది మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆవులపల్లి పంచాయతీ చిన్న దేవర కుప్పం గ్రామానికి చెందిన ఎస్టీలు తమ పశుసంపదను మేత కోసం అడవి మార్గంలో తోలుకు వెళ్లి రావడానికి దారి సమస్యను, యానాది వాడ గ్రామానికి చెందిన 12 కుటుంబాల వారికి ఇంటి స్థలాలు కేటాయించడం వ్యవసాయ యోగ్యమైన భూమిని అందించడం విషయాలపై తహశీల్దార్, విఆర్ఓ మునీశ్వర, సర్వేయర్ వెళ్లి పరిశీలించారని తెలిపారు.

'అన్నదాత సుఖీభవ'ను పరిశీలించాలి: ఆర్డీవో

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: అన్నదాత సుఖీభవ పథకం క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆర్డీవో భవాని అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకాలను రైతులకు అందించేందుకు ఏర్పాటు చేశారని ప్రతి భూమి కలిగిన రైతు ఖాతాలోకి ప్రభుత్వం అందించే నగదు జమ అయ్యిందా? లేదా పరిశీలించాలన్నారు. ఉమ్మడి పట్టా పాస్ పుస్తకాలు వున్న వారికి పరిశీలించి నిజమైన వారికి సిఫార్సు చేయాలన్నారు. ప్రభుత్వ లెక్కల్లో ఉన్న వారికి పరిశీలించాలన్నారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ , డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణి, వ్యవసాయ అధికారి భారతి, వీఆర్వోలు సచివాలయ వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

కుప్పం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా సుదర్శన్

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ సుదర్శన్ ఎన్నికయ్యారు. కుప్పం లయన్స్ క్లబ్‌కు సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా శివ, కోశాధికారిగా లెనిన్ బాబు, ఉపాధ్యక్షులుగా సెల్వం, శిరీషలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని లయన్స్ క్లబ్ డిస్టిక్ గవర్నర్ ఆమోదించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లి గ్రామ పంచాయతీ తమ్మినా యనిపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జె మురళీధర్ మంగళవారం తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టిక ఆహారం, రికార్డులు పరిశీలించి పిల్లలకు ప్రతిరోజు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు, గర్భవతులకు, తల్లులకు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీశివకుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారిణి హేమలత, పంచాయతీ కార్యదర్శి ఎస్ రిజ్వాన, నాయకులు భాను ప్రతాప్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

కాణిపాకం బ్రహ్మోత్సవాలకు రండి..

రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి-ఐరాల: వరసిద్ధి వినాయక స్వామి వారి 2025 వ సంవత్సరం వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్‌కు విజయవాడ గొల్లపూడి లోని కమిషనర్ కార్యాలయంలో కాణిపాకం ఆలయ ఏఈవో మంగళవారం మర్యాదపూర్వ కలిసి ఆహ్వాన పత్రికలు అందించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి..

ఎమ్మెల్యేను కలిసిన తాపీమేస్త్రీలు

ప్రజాశక్తి-పలమనేరు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలమనేరు తాపీమేస్త్రీలు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి అభ్యర్థించారు. మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి వారు మాట్లాడుతూ పుంగనూరు ప్రాంతానికి చెందిన ఓ కాంట్రాక్టర్ కారణంగా తమకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు తెలిపారు. తక్కువ ధరకే పనులు చేయిస్తామని నాసిరకం పనులతో ప్రజలను మభ్యపెడుతున్న ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనిపై తన వంతు సహకారం మీకు ఉంటుందని అయితే మేస్త్రిలందరూ ఐక్యంగా ఉంటూ యూనియన్ గా ఏర్పాటై ఒక్క మాటపై అందరు ఉంటూ సమస్యలపై పోరాడాలని ఎమ్మెల్యే వారికి తెలిపారు. ఎప్పుడు ఈ అవసరం వచ్చిన మీకు అండగా నిలుస్తానని వారికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

పెట్రోల్ బంకు తనిఖీ

ప్రజాశక్తి-తవణంపల్లి: తవణంపల్లిలో ఇండియన్ పెట్రోల్ బంక్‌ను జాయింట్ కలెక్టర్ రాజేంద్ర పడేల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇండియన్ పెట్రోల్ బంక్ తనిఖీలో రికార్డులు పరిశుభ్రత లైసెన్సును, పెట్రోలు మీటర్లు పరిశీలించి అన్ని సక్రమంగా నిర్వ హిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు సుధాకర్ , విఆర్ఓ, కార్యదర్శి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య రంగంలో అపార అవకాశాలు

అపోలో జీఎం డాక్టరు వినోద్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆరోగ్యరంగంలో వైద్యులు, నర్సులు మాత్రమే కాకుండా అనుబంధ ఆరోగ్య నిపుణులు, ఆసుపత్రి నిర్వహణ, వైద్య పరిశోధన, డిజిటల్ ఆరోగ్య సేవలు వంటి విభాగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని అపోలో జీఎం డాక్టరు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ది అపోలో యూనివర్సిటీ, అలైడ్ హెల్త్ సైన్సెస్ విభాగం, అపోలో కెరియర్ కౌన్సెలింగ్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'ఆరోగ్యరంగంలో వృత్తి అవకాశాలు' సదస్సులో అపోలో నాలెడ్జ్ సిటీ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) డాక్టరు వినోద్ కుమార్ పచ్చిగల్లా విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించారు. ఆరోగ్యరంగంలో వైద్యులు, నర్సులు మాత్రమే కాకుండా అనుబంధ ఆరోగ్య నిపుణులు, ఆసుపత్రి నిర్వహణ, వైద్య పరిశోధన, డిజిటల్ ఆరోగ్య సేవలు వంటి విభాగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్యరంగం ఎప్పటికీ పెరుగుతూ ఉండే విస్తృతమైన రంగమని, వైద్యులు, నర్సులు మాత్రమే కాకుండా, అలైడ్ హెల్త్ ప్రొఫెషనల్స్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, క్లినికల్ రీసెర్చ్, హెల్త్‌కేర్ టెక్నాలజీ, పబ్లిక్ హెల్త్ మేనేజ్‌మెంట్ వంటి విభాగాల్లోనూ విపరీతమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు.ఇకపై ఆరోగ్యరంగం కేవలం చికిత్సకే పరిమితం కాదని, డిజిటల్ హెల్త్, మెడికల్ డేటా మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్ ఐటి సొల్యూషన్స్ వంటి విభాగాలు భవిష్యత్తులో ప్రధాన పాత్ర పోషిస్తాయని ఆయన వివరించారు. నైపుణ్యం, క్రమశిక్షణ, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ ఈ రంగంలో కీలకం అని ఆయన సూచించారు.ఈ సదస్సుకు స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ కె.భాస్కర్‌రెడ్డి, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ రామయ్య ఇటుమల్ల, అలైడ్ హెల్త్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ సుచరిత.పి, అధ్యాపకులు, అలైడ్ హెల్త్ విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు వాడాలి

జిల్లా వ్యవసాయ అధికారి జె మురళీకృష్ణ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: రైతులు పంటలు వేసుకునే ముందు నాణ్యమైన ఎరువులను వాడాలని తద్వారా అధిక దిగుబడి పెరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి జె మురళీకృష్ణ రైతులకు సూచించారు. రాజుపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రైతు వేసిన పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా మట్టి నమూనాలను పరిశీలిస్తే నేలల్లో సేంద్రియ పదార్థం తక్కువగా ఉన్నందు వల్ల రైతులు తప్పకుండా పచ్చి రొట్ట ఎరువులైన జనుము, జీలుగ వంటి ఎరువులను ఉపయోగించాలని, తద్వారా కలిగే ప్రయోజనాలు అధిక దిగుబడి, పంటలకు సరైన పోషకాలను అందిస్తాయన్నారు. కొన్ని నాణ్యమైన ఎరువులు నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని, తక్కువ వ్యర్థాలను ఉత్పత్తి చేస్తాయన్నారు. అధిక దిగుబడి వస్తుందన్నారు. ముందు భూసార పరీక్షలు వల్ల నేలలోని పోషక పదార్థాల స్థాయిలను తెలుసుకోవచ్చు అందుకు అనుగుణంగా ఎరువులను ఉపయో గించ వచ్చున్నారు. యూరియా వాడకం వల్ల కలిగే అనర్థాలను రైతులకు వివరించి ద్రవ రూపంలో ఉన్న నానో యూరియాను పంటలకు స్ప్రే చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. అన్నదాత సుఖీభవ అందని రైతులు వారు ఆఖరు తేదీ నేడు 20 ఆగస్టు 2025 వారి సమీప రైతు సేవ కేంద్రంలో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సి శివకుమార్, ఎస్ఓ చౌదరి, మండల వ్యవసాయ అధికారిణి, పంచాయతీ రెవెన్యూ అధికారి కృష్ణంరాజు, స్థానిక టిడిపి నాయకులు భాను ప్రతాప్ రెడ్డి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ప్రమాదకర విద్యుత్ వైర్లను సరిచేయండి..

రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్

ప్రజాశక్తి- రామకుప్పం: మండల కేంద్రమైన రామకుప్పంకు సమీపంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలని రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం రెస్కో సిబ్బందితో కలిసి పాఠశాల ఆవరణలో వృక్షాల మధ్య ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో విద్యుత్ వైర్లకు చెట్లు కొమ్మలు తగలడంతో తరచూ ప్రమాదం జరగచ్చని, వర్షాకాలంలో తగు జాగ్రత్త తీసుకొని సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రెస్కో సిబ్బందికి తెలిపారు. రెస్కో పరిధిలో ప్రజలకు, రైతులకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజనీ కుమార్, రెస్కో అధికారులు శంకర్, రాజారెడ్డి,సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లను పరిశీస్తున్న రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్

'స్త్రీ శక్తి' ఎంతో ఉపయోగం

మహిళల ఆనందం

ప్రజాశక్తి- పలమనేరు: కూటమి ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం బస్సులో ఉచిత ప్రయాణం తమకు ఎంతో ఉపయోగకరమని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ పథకం అమలులో మహిళలకు ఎదురవుతున్న సమస్యలు, ఉపయోగాల గురించి మహిళా ప్రయాణికులను 'ప్రజాశక్తి' మంగళవారం ప్రశ్నించింది. ఈ సందర్భంగా వారు పలు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

ఎంతో ఉపయోగం

బస్సుల్లో ఉచిత ప్రయాణం మాకు ఎంతో ఉపయోగం..పేద ప్రజలకు డబ్బు మిగిలే అవకాశం వుంది. మాకు ఆనందంగా వుంది.

-ప్రమీలమ్మ, అప్పినపల్లి.

కుటుంబానికి ఆర్థిక శక్తి

ఉచిత బస్సు ప్రయాణం మాకు ఎంతో ఉపయోగ పడుతుంది. కుటుంబానికంతా ఆర్థిక శక్తిని ఇస్తోంది. మా ఊరి నుండి పలమనేరుకు సొంతంగా వచ్చి తిరిగి ఊరికి వెళుతున్నాను.. ఎంతో సంతోషంగా వుంది. పథకం ప్రారంభించినందుకు కృతజ్ఞతలు..

- రాజమ్మ, గజ్జలవారిపల్లి.

మహిళలకు ఆర్థిక తోడ్పాటు

బైరెడ్డిపల్లి నుండి పలమనేరుకు నా బిడ్డను ఆస్పత్రికి తీసుకెళ్లి ట్రీట్‌మెంట్ తీసుకుని వెళుతున్నాను. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల మహిళలకు, వారి కుటుంబానికి ఎంతో ఆర్థిక తోడ్పాటు అందుతుంది. ఆనందంగా వుంది.

- లక్ష్మి , బైరెడ్డిపల్లి.

పెరిగిన మహిళా ప్రయాణికులు

ఆగస్టు 15వ తేదీ ప్రారంభమైన స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం వల్ల పలమనేరు డిపోలో 16,17వ తేదీల్లో బాలికలు, మహిళలు కలిపి 19,724 మంది ప్రయాణించారు. రాయితీ విలువ 7,61,444 రూపాయ లు..ఈ పథకం ప్రారంభం తర్వాత మహిళా ప్రయాణికులు అధికంగా ప్రయాణిస్తున్నారు. బాలికలు, ఉద్యోగులు, మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

- స్వామి, పలమనేరు ఆర్టీసీ డిపో మేనేజర్.

రైతులకు ఆర్థిక అవగాహన సదస్సు

ప్రజాశక్తి -సోమల: సోమల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు ఒకరోజు ఆర్థిక అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చౌడేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మేనేజర్ నాగవేణి మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సభ్యులైన రైతులు తమ ఆర్థిక అవసరాల కోసం తక్కువ వడ్డీతో రుణాలను పొంది రుణాలను సకాలంలో చెల్లించి సంఘం ఆర్థిక పురోగతికి సహకరించాలని కోరారు. లావాదేవీలు మొత్తం పారదర్శకంగా నిర్వహించేందుకు పూర్తిగా ఆన్‌లైన్ విధానం చేశామని కోళ్ల ఫారాలు నిర్మించుకోవడం, గొర్రెలను పెంచడం, పాడి పశువుల కోసం, ఇంటి నిర్మాణం కోసం, వ్యవసాయ బోరు మోటారు తదితర అవసరాల నిమిత్తం రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తున్నామని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలని కోరారు. సూపరువైజరు ఆది మోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసుకోవడం వల్ల ఇతర బ్యాంకుల కంటే తమ సహకార సంఘంలో అధిక వడ్డీ ఇస్తున్నామని ప్రస్తుతం పూర్తిగా ఆన్‌లైన్ చేసిన కారణంగా ఎలాంటి పొరపాట్లకు తావు ఉండదని లావాదేవీలు పూర్తిగా ఆన్‌లైనులోనే పొందుపరచడం వల్ల ఎక్కడైనా తమ వివరాలను తెలుసుకునే అవకాశం ఉందన్నారు. సీఈవో చిన్న రెడ్డప్ప మాట్లాడుతూ సోమల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 3,261 మంది ఓటు హక్కు కలిగిన రైతులు ఉన్నారని 300 మంది రైతులు తక్కువ డిపాజిట్‌తో సభ్యత్వం కలిగి ఉన్నారని త్వరలోనే మండలంలోని వ్యవసాయ భూమి వున్న రైతులకు సభ్యత్వం అందించే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. సహకార సంఘం చైర్మన్ శివ శంకర్ మాట్లాడుతూ గతంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులు తీసుకున్న రుణాలు ఇతర వివరాలు సక్రమంగా లేకుండా అవకతవకలు చోటుచేసుకున్న సందర్భాలు వున్నాయన్నారు. ప్రస్తుతం అలాంటి వాటికి తావు లేకుండా ఆన్లైన్ విధానం వల్ల రైతులకు జవాబుదారితనం లభిస్తుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కరణం శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ ప్రతి రైతు ఆర్థికంగా ఎదిగేందుకు సహకార సంఘాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అష్రఫ్, సతీష్, 30 మంది రైతులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మేనేజర్ నాగవేణి

కరాటేలో మదర్ థెరిసా విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని మదర్ థెరిసా విద్యార్థులు ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డేవిడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు పట్టణంలోని పర్వత రెడ్డి ఆనంద్ మినీ ఇండోర్ స్టేడియంలో ఆర్గనైజర్ నల్లూరి మోహన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్‌లో మదర్ థెరిసా పాఠశాల విద్యార్థులు పాల్గొని విజయం సాధించాలని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుండి సుమారు 600 మంది విద్యార్థులు పైగా పాల్గొన్న ఈ పోటీల్లో మదర్ థెరిసా విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరిచారన్నారు. ఆరుగురు విద్యార్థులు స్వర్ణ పతకాలను, ఏడుగురు విద్యార్థులు రజిత,15 మంది విద్యార్థులు కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులకు టీమిండియా కరాటే హెడ్ కోచ్ కీర్తన్ కొండూరు పతకాలు, ప్రశంస పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మదర్ థెరిసా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రవీంద్ర బాబు మాట్లాడుతూ మదర్ థెరిసా పాఠశాల విద్యార్థులు క్రీడా ప్రతిభ మాత్రమే కాకుండా కష్టపడి లక్ష్యాలు సాధించే స్ఫూర్తిని ప్రదర్శించారని కొనియాడారు. ఆ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డేవిడ్ మాట్లాడుతూ భవిష్యత్తులోనూ విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించడానికి తమ విద్యాసంస్థలు కట్టుబడి ఉన్నాయని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కరాటే మాస్టర్ డాక్టర్ సదాశివను, విద్యార్థులను అభినందించారు.

కరాటే ఛాంపియన్ షిప్ పతకాలు సాధించిన మదర్ థెరిసా విద్యార్థులు

అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి: కమిషనర్

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పురపాలక సంఘంలో పౌరులు అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని మున్సిపల్ కమిషనర్ ఎన్వి రమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు పలమనేరు పురపాలక సంఘంలోని నీలం సంజీవ రెడ్డి కౌన్సిల్ హాలులో 'ఉల్లాస్– అక్షరాంధ్ర' అర్బన్ లెవల్ ట్రైనింగ్ ప్రోగ్రాం ను పలమనేరు పురపాలక సంఘ స్వయం సహాయక సంఘాల రిసోర్స్ పర్సన్స్ వాలంటీర్స్ తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ 'ఉల్లాస్ అక్షరాంధ్ర' ముఖ్య ఉద్దేశ్యం 2029 సంవత్సరం నాటికి పలమనేరు పురపాలక సంఘంలో పౌరులు అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఇప్పటి వరకు సుమారు 6,200 మంది నిరక్షరాస్యులుగా ఉన్నారని గుర్తించామన్నారు. వీరిని విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి పది మంది నిరక్షరాస్యులకు ఒక వాలంటీరును గుర్తించి ఆరు మాసాల కాలంలో డిజిటల్, ఆర్థిక, ఆరోగ్య, న్యాయ అక్షరాస్యత, సామాజిక అక్షరాస్యత పైన అవగాహన కల్పించి 2029 సంవత్సరం నాటికి పూర్తి అక్షరాస్యత సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, బాబా, గుణకర్ రెడ్డి పాల్గొన్నారు.

టిడిపికి బీసీలే వెన్నెముక: ఎంపీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఐక్యత, ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే రాజ్యాధికారం వైపు అడుగులేయవచ్చని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అభిప్రాయపడ్డారు. ఢిల్లీ, తెలంగాణ భవన్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నిర్వహించిన సెమినార్‌కు చిత్తూరు ఎంపి సహచర ఎంపీలతో కలిసి సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అధిక శాతం బీసీలున్నారని గుర్తు చేశారు. అయితే బీసీ, ఎస్సీ, ఎస్టీల మధ్య లోపించిన అనైక్యత వల్లే ఇప్పటివరకు రాజ్యాధికారం వైపు అడుగులు వేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు ఆర్థికంగా వెనుకబాటుకు గురవడం కూడా ప్రధాన కారణం అన్నారు. ఈ నేపథ్యంలో వెనుకబడిన వర్గాలలో నెలకొన్న సమస్యలను సానుకూలంగా పరిష్కరించుకొని ఐక్యతను, ఆర్థిక స్వావలంబనను సాధించడం పై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య , ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)రాజ్య సభ్యులు బీదా మస్తాన్ రావు, రాజ్య సభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరావు యాదవ్, ఆంధ్రప్రదేశ్ ఇంచార్జ్ యలగాల నూకానమ్మ యాదవ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులు తొలగించండి

ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి వైఎస్ఆర్‌టిఏ వినతి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల ఆర్థిక ఇబ్బందులను తొలగించాలని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ వీ రెడ్డి శేఖర్ రెడ్డి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కి లేఖ ద్వారా వినతి చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పైగా కావస్తున్నా ఉద్యోగుల ఆర్థిక బకాయిలు చెల్లించడంలో విఫలమైందని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాగానే ఐఆర్ ఇస్తామన్న హామీని విస్మరించడం సరికాదన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకొని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన నాలుగు డి ఏ లు, ఆర్జిత సెలవుల చెల్లింపులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఆర్సి కమిషన్ ఏర్పాటు చేసి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు గ్రాట్యూటీ, అర్ధ వేతన సెలవులు, ప్రావిడెంట్ ఫండ్ మొదలైన చెల్లింపులు సంవత్సర కాలం పాటు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.2003 డిఎస్సీ వారికీ పాత పెన్షన్ విధానం అమలు, ఈ హెచ్ ఎస్ కార్డుల ద్వారా మెరుగైన వైద్యం అందించడం పట్ల ప్రభుత్వం దష్టి సారించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలపై కూటమి ప్రభుత్వం అలసత్వం వహిస్తే అన్ని సంఘాలతో కలుపుకుని ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరారు.

క్రైం న్యూస్

కుమారుడిపై తండ్రి దాడి

ప్రజాశక్తి-చౌడేపల్లి: కుమారుడిపై తండ్రి కొడవలితో దాడి చేసి గాయపరిచిన సంఘటన చౌడేపల్లి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని పెద్ద కొండామరి గ్రామానికి చెందిన అంజప్పకు పక్క గ్రామంలో ఓ మహిళతో 15 సంవత్సరాలుగా వివాహేతర సంబంధం వుంది. అప్పటి నుంచి ఇంటికి రాకుండా చౌడేపల్లిలో సంత గేటు వద్ద టైలరింగ్ వృత్తి చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ప్రభుత్వం ఇటీవల రేషన్ కార్డుల మార్పిడి సందర్భంగా అతని పేరు రేషన్ కార్డులో మార్చి రాసుకున్నాడు. దీంతో ఇదేమిటని అంజప్ప కుమారుడు విజయ్ కుమార్ , అమరావతి అల్లుడు వెంకటరమణలు వెళ్లి ప్రశ్నిస్తే తండ్రి అంజప్ప కోపోద్రిక్తుడై కొడవలి, కత్తెరలతో తమపై దాడి చేసినట్లు బాధితులు వివరించారు. గాయాలపాయలైన తమను స్థానికులు పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాలని ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

బావిలో యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు గుండు బావిలో ఓ గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని గుండుబావి నుండి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు . మధ్యాహ్నం స్థానికులు ఆ మృతదేహాన్ని స్థానిక లింగాయతి వీధిలో ఉంటున్న గౌతమ్‌గా గుర్తించారు. గత రెండు రోజులుగా ఆ వ్యక్తి ఆచూకీ తెలియడంలేదని తెలిపారు. ఇది హత్యా లేక ఆత్మహత్యా? అనే వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి వుంది.

ఐదుగురు జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి- బంగారుపాలెం: ఐదుగురు జూదరులు అరెస్ట్ చేసి వారి వద్ద వున్న పేకాట ముక్కలు, నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు మంగళవారం మండలంలోని మార్కెట్ యార్డ్ వెనుక భాగంలో పేకాటాడుతున్నారని సమాచారం రావడంతో దాడులు చేపట్టి ఐదు గురు పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేశామని తెలిపారు. వారి వద్ద వున్న 6,150 రూపాయలు నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని తెలిపారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -బంగారుపాలెం: అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని ఈచినేరిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. ఈచినేరిపల్లికి చెందిన శంకరయ్య కుమారుడు సురేంద్ర (37) అతిగా మద్యం తాగి సమీపంలోని పురుగుల మందు బాటిల్‌ను తాగి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

35 మందికి జరిమానా

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఈనెల 12, 19వ తేదీల్లో మద్యం మత్తులో వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డ 35 మందికి రూ. 3లక్షలా50 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు నిచ్చారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ 35 మంది పట్టుబడ్డారని పోలీసులు తెలిపారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో మంగళవారం ప్రవేశపెట్టగా జడ్జి కుమారి ఉమాదేవి వీరికి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున మొత్తంగా 3లక్షలా50వేలు రూపాయలు జరిమానా విధించారని తెలిపారు.

శునకాలను నివారించండి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: శునకాలను నివారించాలని ప్రజలు అభ్యర్థిస్తున్నారు. మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రారు కార్యాలయం సమీపంలో దాదాపు పాతిక శునకాలు రహదారిపై మంగళవారం హల్‌చల్ చేశాయి. వాటిని చూసిన ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వీటి వల్ల ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం వుందని వాటి దాడి వల్ల అనారోగ్య పరిస్థితులు కూడా ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శునకాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని వాటికి ఆహారం అందడం వల్ల అవి రహదారుల్లో తిరుగుతున్నాయని వీటిని నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే భారీ నష్టం సంభవించే ప్రమాదం వుందని స్థానికులు పేర్కొంటున్నారు.

మనోహర్‌కు నివాళి

ప్రజాశక్తి- పలమనేరు: మహిళా సంఘం జిల్లా కార్యదర్శి, సిపిఎం జిల్లా నాయకురాలు భువనేశ్వరి భర్త మనోహర్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. పలమనేరు మండలం నెత్తిపట్ల గ్రామంలో సిపిఎం, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో మనోహర్ భౌతిక కాయానికి మంగళవారం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షుడు గిరిధర్ గుప్తా, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శ్యామల అనిత, ప్రజానాట్య మండల జిల్లా నాయకులు ప్రతాప్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బాలసుబ్రహ్మణ్యం, మహిళా సంఘం జిల్లా నాయకులు జయంతి, ధనలక్ష్మి సిఐటియు నాయకులు రాజా, పాదం సుబ్రహ్మణ్యం, గణేష్ పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ ఫొటోగ్రఫీ డే



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ది అపోలో యూనివర్సిటీలో మంగళవారం వరల్డ్ ఫొటోగ్రఫీ డే ను ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఫొటోగ్రఫీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫొటో వాక్, మొబైల్ ఫొటోగ్రఫీ, ఫొటో ట్రెజర్ హంట్, మూడ్ ఫొటోల ద్వారా కథనం, ఫొటో ఎడిటింగ్, వింటేజ్ కెమెరా ప్రదర్శన వంటి విభిన్న పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో చురుకుదనం, సృజనాత్మకతకు ఈ పోటీలు అద్దంపట్టాయి. .ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వైస్ చాన్సలర్ డా. హెచ్. వినోద్ భట్, గౌరవ అతిథి రిజిస్ట్రార్ ప్రొ. ఎం. పోతరాజు విజేతలకు బహుమతులు అందజేశారు. వీసీ డా. హెచ్. వినోద్ భట్ మాట్లాడుతూ ఒకప్పుడు ఫొటోగ్రఫీ చాలా ఖరీదైన హాబీగా ఉండేదని, రోల్స్ నుంచి డిజిటల్ యుగం వరకు వచ్చిన మార్పులు ఈ రంగాన్ని పూర్తిగా మార్చేశాయన్నారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ పీడియాట్రిషన్, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ ప్రొఫెసర్ డాక్టరు ఆర్ ప్రసన్న వర్చువల్‌గా పాల్గొని, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీలో తన అనుభవాలు, నేర్చుకున్న పాఠాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రఫీ క్లబ్ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలమనేరు: ఫొటోగ్రఫీ డేని పలమనేరు పట్టణం క్లాక్ టవర్ వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు ఫొటో కెమెరా సృష్టికర్త 'లూయిస్ డాగురె' చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేసి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ పెద్దలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కార్యదర్శి సభ్యులు పాల్గొన్నారు.